సాక్షి ఒడిశా


బుధవారం । 13 । ఆగస్టు । 2025

ఆలయ ధర్మకర్త పదవికి ఆహ్వానం



ఈవో శ్రీనివాస్

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, శంబరపోలమాంబ అమ్మవారి ఆలయ ధర్మకర్త పదవికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో బి.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఈవో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని శంబర గ్రామంలో కొలువైన శంబర పోలమాంబ అమ్మవారి దేవస్థానం ధర్మకర్త పదవికి ఆంధ్రప్రదేశ్ ధార్మిక పరిషత్ విజయవాడ వారి ఉత్తర్వుల ప్రకారం వంశపారంపరేతర ధర్మకర్త పదవికి దరఖాస్తులు కోరుతున్నామని తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు 10రోజుల్లోగా దేవాలయ కార్యాలయంలో కార్యనిర్వాహణాధికారికి దరఖాస్తులు సమర్పించాలని ఈవో కోరారు.



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.3,75,765
బంగారం	20 మిల్లీ గ్రాములు
వెండి	28 గ్రాముల 600 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

న్యూస్‌రీల్

స్వాతంత్ర్య వేడుకలకు అతిథిగా మంత్రి గోకులానంద



మంత్రి మల్లిక్

రాయగడ: స్థానిక గోవింద్ర చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 15వ తేదీన జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు మంత్రి గోకులానంద మల్లిక్ ముఖ్య అతిథిగా హాజరవ్వనున్నారు. ఆరోజు ఉదయం 8.30 గంటలకు జాతీయ పతాకావిష్కరణ, ప్రసంగం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం జిల్లా జైలులో ఖైదీలకు, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. ఈ మేరకు మైదానాన్ని జిల్లా యంత్రాంగం సిద్ధ చేస్తోంది.

గనుల తవ్వకాలు చేపట్టొద్దు



గనుల తవ్వకాలను వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు

రాయగడ: సదరు సమితి ఇరుకుబడి పంచాయతీ పరిధి బాలపాడు గ్రామ సమీపంలో ఉన్న గనుల తవ్వకాలకు సంబంధించి మంగళవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో సంబంధిత అధికారులకు చుక్కెదురైంది. గ్రామంలోని గనులను తవ్వుకుంటూ పోతే తమ గ్రామంతో పాటు మరో 15 గ్రామాలు పర్యావరణపరంగా దెబ్బతినే అవకాశం ఉందని, అందువలన ఈ తవ్వకాలకు అనుమతించేదిలేదని గ్రామస్తులు స్పష్టం చేశారు. దీంతో రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు, రాష్ట్ర అటవీ శాఖ, పర్యావరణ, వాతావరణ విభాగానికి చెందిన అధికారులు ప్రజల అభిప్రాయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నారు. సమావేశంలో జిల్లా అదనపు మేజిస్ట్రేట్ నిహారి రంజన్ కుహరొ, రాయగడ తహసీల్దార్ ప్రియదర్శిని స్వాయి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం సీజ్



కల్యాణ మండపాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

జయపురం: స్థానిక మెయిన్ రోడ్డు బంకమఠం ప్రాంతంలోని బాబా సాహెబ్ కల్యాణ మండపాన్ని మున్సిపల్ అధికారులు సోమవారం తాళాలు వేసి సీజ్ చేశారు. కల్యాణ మండపాన్ని లీజుకి తీసుకున్న నిర్వాహకులు లీజు డబ్బు చెల్లించకపోవడంతో సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. 2017–18లో ప్రతి ఏడాది రూ.7 లక్షల లీజు తీసుకున్నారు. అయితే 2020 నుంచి డబ్బులు చెల్లికపోవడంతో పాటు నోటీసులకు స్పందించకపోవడంతో సబ్ కలెక్టర్ అక్కవరం శొశ్యా రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ అదనపు కార్యనిర్వాహక అధికారి పూజా రౌత్ తమ సిబ్బందితో వెళ్లి సీజ్ చేశారు. మండప నిర్వాహకులు డబ్బు చెల్లించకపోతే మున్సిపాలిటీనే బాధ్యతలు చేపడుతుందని వెల్లడించారు.

ఘనంగా జాతీయ రిమోట్ సెన్సింగ్ దినోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి:

ఆర్.సీతాపురంలోని సెంచూరియన్ వర్సిటీలో మంగళవారం జాతీయ రిమోట్ సెన్సింగ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డీన్ (సోయెట్) డాక్టర్ ప్రఫుల్ల కుమార్ పండా అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ డా.అనితా పాత్రో విచ్చేసి ప్రారంభించారు. దేశంలో మౌలిక సదుపాయాలు, విపత్తులను ముందుగా కనుగునేందుకు ఈ రిమోట్ సెన్సింగ్ సిస్టం ముఖ్యమైన పాత్ర పోషిస్తోందన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మజీద్ ఫరూఖ్ మాట్లాడుతూ.. ఉపగ్రహాల ద్వారా శాటిలైట్ రిమోట్ సెన్సింగ్‌తో వాతావరణ మార్పులు గమనించగలమన్నారు. సివిల్ ఇంజినీరింగ్ శాఖ అధిపతి డాక్టర్ రాజీవ్ కుమార్ మరియు మాట్లాడుతూ.. రిమోట్ సెన్సింగ్ ద్వారా అంతర్ విభాగ స్వభావాన్ని, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విపత్తుల దిశ తెలుసు కోగలమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ డా.దుర్గాప్రసాద్ పాఢి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరుపై నిఘా



లోక్‌సేవా భవన్

- సీఎస్ మనోజ్ ఆహుజా

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం అధికారులు, సిబ్బంది పనితీరుపై పటిష్ట నిఘా పెట్టనుంది. దీనిలో భాగంగా ప్రజలకు సకాలంలో ప్రభుత్వ సేవలు అందించే అవకాశం ఉంటుందని భావిస్తోంది. ఈ నేపథ్యంలో స్థానిక లోక్‌సేవా భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా అధ్యక్షతన మంగళవారం ప్రభుత్వ శాఖల కార్యదర్శుల సమావేశం జరిగింది. దీనిలో భాగంగా ప్రజలకు ప్రభుత్వ సేవలు కల్పించడంలో జాప్యం నివారణ, ప్రభుత్వ పథకాల అమలు, కార్యాచరణ బలోపేతం చేసే దిశలో 10 ప్రధాన అంశాలపై దృష్టి సారించారు. ఈ సందర్భంగా అన్ని కార్యాలయాల్లో ఏఐ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

కార్యదర్శులకు సూచనలు

- సీఎం కార్యాలయం నుంచి వచ్చే యాఐ నోట్స్‌పై తక్షణమే స్పందించాలి.
- అధికారులు సకాలంలో విధులకు హాజరవ్వాలి.
- అధికారులు పనితీరు మెరుగుపరచుకునేందుకు పూర్తి అవకాశం కల్పించాలి. ఆ తర్వాత కూడ తీరు మారకుంటే అనివార్య విరామం (సీఆర్ఎస్) మంజూరు.
- అన్ని జిల్లాస్థాయి ప్రభుత్వ కార్యాలయాల్లో కృత్రిమ మేధసు (ఏఐ) కెమెరాలు ఏర్పాటు.
- ప్రజలకు సేవలు అందించడంలో జాప్యాలు పర్యవేక్షించబడతాయి. అక్టోబర్ నుంచి ముఖ్యమంత్రి డ్యాష్ బోర్డు ప్రారంభం.
- ప్రతినెలా 7వ తేదీన జిల్లా కలెక్టర్ కేంద్ర పథకాల అమలు, కార్యాచరణను సమీక్షిస్తారు.
- అటవీ, పర్యావరణ మరియు రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖలు ప్రతినెలా 12వ తేదీన సమీక్షిస్తాయి.
- బడ్జెటు నిధుల సద్వినియోగంతో ఆదాయం పెంపుదలపై అన్ని విభాగాలు దృష్టిని కేంద్రీకరించాలి.
- క్షేత్ర సందర్శనలపై అధికారులు దృష్టి పెట్టాలి.

• సీసీ కెమెరాలు ఏర్పాటు



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్

జయపురం: మున్సిపాలిటీ పరిధి పారాబెడ ప్రాంతం సంతోషిమానగర్‌లో తరచూ జరుగుతున్న దొంగతనాలు, అసాంఘిక శక్తుల ఆగడాలపై నిఘా పెట్టేందుకు ఎట్టకేలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దీనికోసం జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేశారు. సీసీ కెమెరాలను ఎమ్మెల్యే బాహిణీపతి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంతోషిమానగర్‌లో ఒక కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు పార్క్ ఏర్పాటుకు సహకరిస్తానని తెలియజేశారు. సబ్ కలెక్టర్ అక్కవరం శొశ్య రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు యంత్రాంగం తగిన చర్యలు చేపడుతుందని సబ్ డివిజన్ పోలీసు అధికారి పార్థ జగదీష్ కవాసీ వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ నరేంద్ర కుమార్ మహంతి, కమిటీ అధ్యక్షుడు ప్రశాంత పండ, సురమ మహాపాత్రో, ప్రకాశ మిశ్ర, రామనాథ్ సాహు, అజయ మిశ్ర, చంద్రశేఖర మిశ్ర, అజయ పాడి, ప్రదీప్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న స్థానిక ప్రజలు

మైనర్ బాలికపై లైంగిక దాడి

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మోటు పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న నక్కగూడ గ్రామంలో 14 ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన వివాహిత యువకుడు గర్భవతిని చేసి పరారయ్యాడు. దీంతో ఆ యువకుడిపై మోటు పోలీసుస్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బాలిక తండ్రి మరణించడంతో తల్లి కూలి పనులు చేస్తోంది. అలాగే బాలిక అన్నయ్య వలస కార్మికుడిగా ఇతర రాష్ట్రానికి వెళ్లాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిందితుడు బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెబితే చంపుతానని భయపెట్టడంతో బాలిక నోరు మెదపలేదు. అయితే బాలిక శరీరంలో మార్పులు వస్తుండడంతో ఆమె తల్లి కలిమెల ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు గర్భిణీగా నిర్ధారించారు. దీంతో బాలికను నిలదీయగా యువకుడి విషయాన్ని తెలియజేసింది. అయితే అప్పటికే యువకుడు గ్రామం నుంచి పరారయ్యాడు. ప్రస్తుతం బాలికకు 8 నెలలు నిండాయి. దీంతో గ్రామస్తుల సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రాయగడ: జిల్లాలోని గుడారి వద్దనున్న వంశధార నది వంతెన సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. గాయపడినవారిలో ఉర్లర్‌కొన గ్రామానికి చెందిన మంటూ సబర్, కపిలాస్ సబర్, రవుతగుడ గ్రామానికి చెందిన ఉపేంద్ర సబర్‌లు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను గుడారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తరలించారు. ఈ యువకులు ఒకే బైకుపై సోమవారం గుడారి వెళ్లి తిరిగి అదేరోజు రాత్రి స్వగ్రామానికి వెళ్తున్న సమయంలో బైకు అదుపు తప్పడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

బీజేడీ సీనియర్ నేత సుషార్ సామల్ మృతి



సుషార్ సామల్ (ఫైల్)

కొరాపుట్: బీజేడీ సీనియర్ నాయకుడు సుషార్ సామల్ (చుంగా) (55) భువనేశ్వర్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. చుంగా గత కొంతకాలంగా గుండె సమస్యతో బాధపడుతున్నారు. ఆయన నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం ఎమ్మెల్యే, బీజేడీ జిల్లా అధ్యక్షుడు మనోహర్ రంధారికి అనుచరుడిగా ఉన్నారు. గత 20 ఏళ్లలో పార్టీలో జిల్లాస్థాయిలో అనేక పదవులు చేపట్టారు. ఈయన అంతిమ యాత్రలో బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి పాల్గొన్నారు.

పరామర్శ



సిద్ధాంత మహాపాత్రోతో మాట్లాడుతున్న రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: గంజాం జిల్లా దిగపోహండి ఎమ్మెల్యే సిద్ధాంత మహాపాత్రో తల్లి డా.కనక మహాపాత్రో ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయనను పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి మంగళవారం పరామర్శించారు.

పరేష్ రథ్‌కు సరళదేవి సమ్మాన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న పరేష్ రథ్

జయపురం: పట్టణానికి చెందిన పరిశోధకుడు, రచయిత, పాత్రికేయుడు, పర్యావరణ ప్రేమికుడు డాక్టర్ పరేష్ రథ్‌కు సరళదేవి సమ్మాన్ అవార్డు లభించింది. ఒడియా భాష, సాహిత్యం, సంస్కృతి విభాగం, సరళ దేవి స్మారక ట్రస్టులు నిర్వహించిన కార్యక్రమంలో అవార్డుతో ఆయనను సత్కరించారు. భువనేశ్వర్ భంజ మండపంలో ఆదివారం పాత్రికేయుడు ప్రదోష్ పట్నాయిక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ, ప్రముఖ ఒడియా దినపత్రిక సంబాద్ అధినేత సౌమ్యరంజన్ పట్నాయిక్ పాల్గొని డాక్టర్ పరేష్ రథ్ సాహిత్యానికి, ఒడియా సంస్కృతి పరిరక్షణకు ప్రశంసనీయమైన సేవలు అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా ఎమ్మెల్యే శారద జెన, ముఖ్యవక్తగా భాష, సాహిత్య, సంస్కృతి విభాగ స్వతంత్ర్య కార్యదర్శి దేవ ప్రసాద్ దాస్, గౌరవ అతిథిగా ప్రముఖ కవి మనోరమ బిశ్వాల్ మహాపాత్రో, సమాజ సేవకుడు రమేష్ నాగతియాల్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌ఛైర్ల పంపిణీ



దివ్యాంగులకు వీల్‌ఛైర్లు అందజేస్తున్న అధికారులు

రాయగడ: జిల్లా సామాజిక సురక్ష సమితి, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అశోక్ కల్యాణ మండపంలో జరిగిన భీమ్ భోయ్ కార్యక్రమంలో దివ్యాంగులకు వీల్‌ఛైర్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండొ, గౌరవ అతిథిగా మున్సిపల్ చైర్మన్ మహేష్ కుమార్ పట్నాయక్, కార్యనిర్వాహక అధికారి కులదీప్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 248 మంది దివ్యాంగులకు జిల్లా సామాజిక సురక్షా సమితి ఆధ్వర్యంలో ఉపకరణాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా అక్షయ కుమార్ ఖెముండొ మాట్లాడుతూ దివ్యాంగులను మనమంతా గౌరవించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారి సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలను సంబంధిత శాఖ అధికారులు వారికి అందేలా చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు.

ఓట్ల వ్యత్యాసంపై హైకోర్టుకు..!

- ప్రకటించిన బీజేడీ నాయకులు
- ఎన్నికల సంఘం సరిగా స్పందించకపోవడంతో నిర్ణయం

భువనేశ్వర్: రాష్ట్రంలో 2024లో జరిగిన శాసన సభ, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపులో వ్యత్యాసాలు చోటుచేసుకున్నాయని విపక్ష బిజూ జనతా దళ్ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. దీనిపై భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సరిగా స్పందించకపోవడంతో బీజేడీ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించింది. ఆ పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ అమర్ పట్నాయక్, ఎమ్మెల్యే ధృబ చరణ్ సాహు, మాజీ ఎంపీ శర్మిష్ఠ సెఠి విలేకరుల సమావేశంలో ఈ నిర్ణయం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో అవకతవకలు జరిగినట్లు ఎత్తిచూపుతూ బీజేడీ వాస్తవాలతో కూడిన ఆధారాలను భారత ఎన్నికల సంఘానికి సమర్పించిందన్నారు. ఇప్పటికి దాదాపు 8 నెలలు గడిచినా ఇంతవరకు ఈసీఐ నమ్మదగిన వివరణ బహిరంగపరచలేదని ఆరోపించారు. ఎన్నికల సంఘం వాస్తవాలపై స్పందించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాలని తీర్మానించినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ కంటే ముందే తాము ఈ విషయంపై స్పందించినట్లు పేర్కొన్నారు.

ఓట్ల మధ్య వ్యత్యాసం

రాష్ట్రవ్యాప్తంగా అన్ని పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ఈవీఎంల్లో నమోదైన ఓట్ల సంఖ్య, లెక్కింపు ఓట్ల సంఖ్యను మించిపోయిందని బీజేడీ నాయకులు తెలియజేశారు. అలాగే పోలింగ్ రోజు సాయంత్రం 5 గంటల తర్వాత నమోదైన ఓట్ల సంఖ్య తీవ్రంగా మారుతూ అమాంతం 7 శాతం నుంచి 30 శాతం వరకు పెరుగుదల కనిపించడం ఆశ్చర్యకరమని పేర్కొన్నారు. ఈ వ్యత్యాసాలను ప్రశ్నిస్తూ గత ఏడాది డిసెంబర్ 19వ తేదీన బిజూ జనతా దళ్ భారత ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిందన్నారు. అలాగే 100 శాతం వీవీప్యాట్ ధ్రువీకరణ కోసం ఉత్తర్వులు జారీ చేయాలని అభ్యర్థించినట్లు వివరించారు. ఓట్ల లెక్కింపును వివరించే ఫారమ్ 17సీ విడుదల చేయాలని కోరారు. కొన్ని నియోజకవర్గాల్లో కొనసాగుతున్న చట్టపరమైన కేసులను పేర్కొంటూ ఈసీఐ తమ అభ్యర్థనను తిరస్కరించినట్లు తెలిపారు. 2024లో జాజ్‌పూర్ నుంచి పోటీ చేసి పరాజయం పాలైన శర్మిష్ఠ సెఠి ఫలితాలు ప్రకటించిన మరుసటి రోజు తాను వ్యక్తిగతంగా ఈసీఐ నుంచి ఫారం 17–సీ కోసం అభ్యర్థించానని వెల్లడించారు. అభ్యర్థనపై స్పందన కొరవడడంతో మరోమారు సంప్రదించినా ఎన్నికల సంఘం సంతృప్తికరమైన సమాధానం జారీ చేయలేదని ఆరోపించారు. ఆ పరిస్థితుల్లో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. ఈ కేసు విచారణ పెండింగ్‌లో ఉందని వెల్లడించారు.

• పెద్ద మనసు



మిత్రులతో కలిసి గుంతలు పూడ్చుతున్న శ్రీనివాస్

రాయగడ: పుట్టినరోజు అంటే విందూ, వినోదాలతో సరదాగా గడిపేవారిని చూసుంటాం. అయితే సదరు సమితి పెంట గ్రామానికి చెందిన వ్యాపారవేత్త దూడల శ్రీనివాస్ తన పుట్టినరోజు పురస్కరించుకొని చేపట్టిన సేవా కార్యక్రమం అందరి ప్రశంసలు పొందింది. ఆయన తన మిత్రులు, ఆత్మీయులతో కలిసి తాము నివసిస్తున్న పెంట (అమలాభట్ట) ప్రాంతం నుంచి కొత్తపేట వరకు సుమారు 5 కిలోమీటర్ల దూరం వరకు ఉన్నటువంటి జాతీయ రహదారిలో గుంతలను సొంత ఖర్చులతో పూడ్చి వేసేందుకు శ్రీకారం చుట్టి ఆదర్శంగా నిలిచారు. రాయగడ నుంచి రాష్ట్ర రాజధాని భువనేశ్వర్, బరంపురం వంటి ప్రధాన నగరాలకు వెళ్లేందుకు ఈ జాతీయ రహదారే ముఖ్యం. నిత్యం వందలాదిమంది ప్రయాణాలు చేస్తుంటారు. అయితే ఈ రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఈ రహదారిలో ఉన్నటువంటి గుంతలను సిమెంటు కాంక్రీట్‌తో పూడ్చి వేశారు. సహకరించాల్సిందిగా చందిలి పోలీసులకు ముందస్తుగా తెలియజేయడంతో పోలీసులు తమ సహకారాన్ని అందించారు. దీంతో దూడల శ్రీనివాస్‌ను స్థానికులు, వాహన చోదకులు అభినందించారు.

ముగిసిన కమ్యూనిస్టు పార్టీ సెమినార్



సెమినార్‌లో పాల్గొన్న కమ్యూనిస్టు పార్టీ నేతలు

జయపురం: పట్టణంలో నిర్వహించిన కొరాపుట్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ రెండు రోజుల జిల్లాస్థాయి సెమినార్ మంగళవారంతో ముగిసింది. దీనిలో భాగంగా దేశ, రాష్ట్ర పరిస్థితులపై నేతలు విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. బీజేపీ హటావో – దేశ్‌కో బచావో అనే పిలుపుతోనే గ్రామాల్లో ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని, నిరుద్యోగం పెరిగిపోయిందని, పేదల కష్టాలకు బీజేపీ పాలనే కారణమని మండిపడ్డారు. ప్రజల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సెప్టెంబర్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి సెమినార్‌కు జిల్లా నుంచి ఏడుగురు ప్రతినిధులు, ఒక సీనియర్ నేతను ఎన్నుకున్నారు. వారు కనీసం 1000 మంది కార్యకర్తలను రాష్ట్ర సెమినార్‌కు తీసుకు రావాలని సూచించారు. తదుపరి కొరాపుట్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య నేతలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో దయనీయ పరిస్థితులు



మాట్లాడుతున్న అభయ్‌కుమార్ సాహు

పర్లాకిమిడి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు వలన రాష్ట్రంలోని రైతులు దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కిసాన్ సంఘటన్ అధ్యక్షుడు అభయ్‌కుమార్ సాహు అన్నారు. స్థానిక తెలుగు సాండివీధి కాంగ్రెస్ భవన్‌లో రైతుల పక్షాన సమర్థన, కృషక్ ప్రిపరేటరీ సమావేశంలో మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు సాగునీరు, సకాలంలో యూరియా అందడం లేదని మండిపడ్డారు. సకాలంలో సబ్సిడీ ఎరువులు అందజేయకపోవడం వల్ల బర్‌ఘడ్, సంబల్‌పూర్ జిల్లాల్లో యూరియా బస్తాలు బ్లాక్ మార్కెట్‌కు చేరుతున్నాయని విమర్శించారు. అలాగే 55 ఏళ్లు నిండిన రైతులకు రూ.10 వేల భృతి అందజేయాలని, వారిని ఫసల్ బీమా యోజనలో చేర్చాలని, అలాగే రైతులకు స్వస్థ్య బీమా కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. రానున్న అక్టోబర్, నవంబర్ మాసాల్లో గజపతి జిల్లా స్థానిక సమస్యలతో పాటు ప్రాంతీయ సమస్యలపై వివిధ సమితి కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు, రాస్తారోకోలు చేపడతామని తెలియజేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, మోహనా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, తూర్పు ఒడిశా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు స్థితికాంత మహంతి, నార్త్ కాంగ్రెస్ నాయకులు తపన్ మిశ్రా, రతన్ నాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బసంత పండా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అవిశ్వాస తీర్మానం పెడతాం

భువనేశ్వర్: రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ సభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెడుతుందని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ తెలిపారు. ప్రధాన విపక్షం హోదాలో బిజూ జనతా దళ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టకుంటే తమ వంతు బాధ్యతగా ఈ చర్యకు పూనుకుంటామని స్పష్టం చేశారు.

జాతీయ పతాకం ఆవిష్కరణ అతిథులు ఖరారు

భువనేశ్వర్: ఈ ఏడాది 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో జాతీయ పతాకం ఆవిష్కరణ అతిథులను ఖరారు చేశారు. ఈ మేరకు జాబితా విడుదల అయింది. నగరంలో జరిగే రాష్ట్ర స్థాయి వేడుకల్లో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకం ఆవిష్కరిస్తారు. ఉప ముఖ్యమంత్రులు మరియు ఇతర మంత్రులు వివిధ ప్రదేశాలలో ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ పతాకం ఎగుర వేస్తారు. మరో 17 చోట్ల ఆర్డీసీ, కలెక్టర్లు అతిథులుగా హాజరై జాతీయ పతాకం ఆవిష్కరిస్తారు. రౌర్కెలా మరియు బరంపురం ప్రాంతాల్లో ఆర్డీసీ, 15 జిల్లాల్లో జిల్లా కలెకర్లు స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. మిగిలిన ప్రాంతాల్లో ఉప ముఖ్యమంత్రి, మంత్రులు పాల్గొంటారు.

జిల్లా	మంత్రి
కెందుఝొర్	కనక వర్ధన్ సింగ్ దేవ్, ఉప ముఖ్యమంత్రి
కటక్	ప్రభాతి పరిడా, ఉప ముఖ్యమంత్రి
సంబల్‌పూర్	సురేష్ కుమార్ పూజారి
బొలంగీర్	రవి నాయక్
కలహండి	నిత్యానంద గోండ్
కంధమల్	కృష్ణచంద్ర పాత్రో
పూరీ	పృథ్వీరాజ్ హరిచందన్
సుందర్‌గడ్	డాక్టర్ ముఖేష్ మహాలింగ్
గజపతి	బిభూతి భూషణ్ జెనా
భద్రక్	కృష్ణచంద్ర మహాపాత్రో
నవరంగ్‌పూర్	గణేష్ రామ్ సింగ్ ఖుంటియా
సువర్ణపూర్	సూర్య వంశీ సూరజ్
అంగుల్	ప్రదీప్ బాలసమంత్
రాయగడ	గోకులానంద మల్లిక్
మయూర్‌భంజ్	సంపద చంద్ర స్వంయి

డిగ్రీ అధ్యాపకుల నిరసన

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు, సిబ్బందికి వెంటనే బదిలీలను చేపట్టాలని జీసీజీటీఏ, జీసీటీఏ జేఏసీ జిల్లా అధ్యక్షుడు సింగూరు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రోణంకి రవిశంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో నాలుగో రోజు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలియజేశారు. బదిలీలతో పాటుగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పేరు మార్పు, జీవో నెంబర్ 42 రద్దుపై ప్రభుత్వం స్పందించాలని నినదించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి డిబేట్‌లో 'గంగోత్రి'కి ప్రథమస్థానం



గంగోత్రిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్)కళాశాలకు చెందిన బీకాం ఒకేషనల్ ఫైనలియర్ విద్యార్థిని జె.గంగోత్రి రాష్ట్రస్థాయి డిబేట్‌లో ప్రథమ స్థానంలో నిలిచింది. సమాచార హక్కు చట్టం-2005 ప్రారంభించి 20 ఏళ్ల పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఈ పోటీల్లో.. కాలేజీ స్థాయి నుంచి ఎన్ఆర్సీ, జోనల్ స్థాయిల్లో విజయం సాధించిన గంగోత్రి రాష్ట్ర స్థాయిలోనూ మొదటిస్థానంలో నిలిచి స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ పి.శామ్యూల్ చేతుల మీదుగా బహుమతిని అందుకుంది. ఈ సందర్భంగా కళాశాలకు చేరుకున్న విద్యార్థినిని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అభినందించారు. కార్యక్రమంలో కామర్స్ శాఖాధిపతి లబ్బ కృష్ణారావు, అధ్యాపకులు లలితబాయి, సంతోషి, ఎస్.మాధవీలత, వాణీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

సదరం పత్రాల వివాదంపై దర్యాప్తు

నరసన్నపేట: నరసన్నపేట ఏరియా ఆస్పత్రిలో ఆర్థో స్పెషలిస్టుగా పనిచేసిన రవికిరణ్ జారీ చేసిన సదరం సర్టిఫికెట్ల వ్యవహారంపై సీఐ శ్రీనివాసరావు తన కార్యాలయంలో మంగళవారం విచారణ నిర్వహించారు. సర్టిఫికెట్లపై కౌంటర్ సంతకాలు చేసిన ముగ్గురు వైద్యుల నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. పలువురికి వికలాంగత్వం లేకపోయినా ఉన్నట్లు డాక్టర్ రవికిరణ్ సదరం పత్రాలు జారీ చేయడంపై ఎస్పీ ఆదేశాల మేరకు నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే డీసీహెచ్‌గా పనిచేసి ప్రస్తుతం రాజాం సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా బాధ్యతలు నిర్వహిస్తున్న రాజ్యలక్ష్మిని విచారించారు. మంగళవారం డాక్టర్ జయశ్రీ, డాక్టర్ నాగమల్లేశ్వరి, డాక్టర్ నవీన్‌లతో మాట్లాడి వివరాలు సేకరించారు.

పంచాయతీల పెంపుదలకు..
అధ్యయనం అవసరం



సమీక్ష సమావేశంలో గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి తదితరులు

• గవర్నర్ హరిబాబు కంభంపాటి

భువనేశ్వర్: రాష్ట్రంలో గ్రామ పంచాయతీల సంఖ్యను పెంచే అవకాశాన్ని అన్వేషించడానికి అధ్యయనం చేపట్టాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి ప్రతిపాదించారు. స్థానిక రాజ్ భవన్ నూతన అభిషేక్ హాల్‌లో మంగళవారం జరిగిన పంచాయతీ రాజ్, తాగునీటి విభాగం కార్యకలాపాలపై జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ ప్రతిపాదన చేశారు. ఈ సమావేశంలో విభాగం మంత్రి రబి నారాయణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని రెవెన్యూ గ్రామాల సంఖ్యతో పోలిస్తే ఒడిశాలో గ్రామ పంచాయతీల సంఖ్య తక్కువగా ఉంది. పాలనను ప్రజలకు దగ్గరగా తీసుకురావడంలో పంచాయితీల పాత్ర అత్యంత కీలకం. ఈ ప్రాముఖ్యతని పరిగణనలోకి తీసుకుని గ్రామ పంచాయతీలు మరియు రెవెన్యూ గ్రామాల స్థితిగతులపై సమగ్ర అధ్యయనం చేయడం అవసరమని విభాగానికి సూచించారు. గ్రామ పంచాయతీలు తక్కువగా ఉండడం వల్ల కొన్నిసార్లు రాష్ట్రం నిర్దిష్ట పథకాల కింద కొన్ని నిధులను కోల్పోయే ప్రమాదం ఉందని గవర్నరు ఎత్తి చూపారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ కార్యక్రమం కింద ప్రతి ఇంటికీ సురక్షితమైన కుళాయి తాగునీటిని అందుబాటులో ఉంచడం భారత ప్రభుత్వ దార్శనికతగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమం వాస్తవ కార్యాచరణని గవర్నర్ సమీక్షించారు. గ్రామీణ జీవితాలను మెరుగుపరిచేందుకు భారత ప్రభుత్వం పక్కా ఇళ్లు, ఉపాధి హామీ, సురక్షితమైన తాగునీటి సరఫరా ప్రధాన పథకాలను అమలు చేయడం ప్రజారోగ్య అభివృద్ధి శాఖ కీలక బాధ్యత అన్నారు. ఈ పథకాలను సమర్థవంతంగా అమలు గ్రామీణ ప్రాంతాల్లో జీవన నాణ్యతను గణనీయంగా మెరుగుపరుస్తుందని అధికారులకు వివరించారు. ఈ పథకాల అమలు పురస్కరించుకుని తలెత్తే సవాళ్లు, సమస్యలపై అధికారుల అనుభాలను తెలుసుకున్నారు. పథకాల అమలు, కార్యాచరణ నేపథ్యంలో తలెత్తే సమస్యలు, ఇబ్బందుల పరిష్కారానికి భారత ప్రభుత్వంతో అవసరమైన చర్యలు తీసుకోవడంలో తన వంతు పూర్తి మద్దతును గవర్నరు ఇచ్చారు. సమావేశంలో వికసిత గాంవ్ వికసిత ఒడిశా, ప్రధానమంత్రి ఆవాస్ యోజన - గ్రామీణ, ప్రధాన మంత్రి - జన్మాన్ పథకం, అంత్యోదయ గృహ యోజన, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వసుధ, సోలార్ ప్రాజెక్టులు, స్వచ్ఛ్ భారత్ మిషన్ - గ్రామీణ మార్కెటింగ్ వంటి పథకాలు, కార్యాచరణ అంశాలను చర్చించారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దంపతులు

భువనేశ్వర్: పేదరికం వలన కుమార్తె దీర్ఘకాలిక అనారోగ్యానికి చికిత్స చేయించలేని దయనీయ పరిస్థితుల్లో కన్న తల్లిదండ్రులు మంగళవారం రాష్ట్ర శాసనసభ సమీపంలో ఆత్మహత్యాయత్నం చేశారు. సకాలంలో అక్కడి పోలీసులు ఈ విషయాన్ని పసిగట్టి అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. బౌధ్ జిల్లా కోటసింగ గ్రామానికి చెందిన ఈ దంపతులు తమ కుమార్తె దీర్ఘకాలిక అనారోగ్యానికి చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కూతురి చికిత్స కోసం స్థానిక వైద్యుల సలహా మేరకు జిల్లా ప్రధాన ఆస్పత్రి వైద్యులను సంప్రదించారు. అక్కడి నుంచి భువనేశ్వర్ ఎయిమ్స్ ఆస్పత్రిలో వైద్యుల్ని సంప్రదించారు. ఈ బిడ్డ అనారోగ్యం నయమయ్యేది కాదని ఎయిమ్స్ వైద్యులు ప్రకటించడంతో ఆ తల్లిదండ్రులు తల్లడిల్లి ఆత్మహత్యకు సిద్ధమయ్యారు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం ఆర్థిక స్థోమత లేక గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. గ్రామస్తుల నుంచి కొంత డబ్బు అప్పుగా తీసుకుని ఇద్దరు మైనర్ పిల్లలతో కలిసి రాష్ట్ర రాజధాని నగరానికి చేరారు. రాష్ట్ర శాసన సభ సమీపంలో ఆత్మహత్య చేసుకోవాలనే లక్ష్యంతో తచ్చాడుతుండగా అక్కడ మోహరించిన పోలీసు బలగాలు అడ్డుకున్నాయి. పోలీసులు వారిని ముఖ్యమంత్రి ఫిర్యాదుల విభాగానికి తీసుకుని వెళ్లి బాలిక చికిత్సకు ఏర్పాట్లు చేయమని సంబంధిత అధికారులకు తెలియజేశారు. దీంతో కథ సుఖాంతం అయింది.

మైనరు బాలలు జల సమాధి

భువనేశ్వర్: కఠాజోడి నదిలో ఇద్దరు బాలలు మంగళవారం జల సమాధి అయ్యారు. పూరీ ఘాట్ పోలీస్‌స్టేషన్ సమీపంలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మృతుల ఆచూకీ కోసం విచారణ కొనసాగిస్తున్నారు.

అటెండర్ ఆత్మహుతియత్నం

భువనేశ్వర్: స్థానిక ప్రైవేట్ కళాశాల క్యాంపస్ ప్రాంగణంలో ఒక యువకుడు ఆత్మాహుతికి యత్నించాడు. ఖండగిరి పోలీస్ ఠాణా పరిధిలోని ప్రైవేట్ కళాశాలలో ఆత్మాహుతికి పాల్పడిన యువకుడు అటెండర్‌గా పనిచేస్తున్నాడు. యువకుడి శరీరం 15 శాతం కాలిపోయింది. చికిత్స కోసం ఎయిమ్స్‌లో చేర్చారు. బాధిత యువకుడు జాజ్‌పూర్ జిల్లా బింఝార్‌పూర్ వాస్తవ్యుడు రాకేష్ పాణిగా గుర్తించారు.

ఏడు కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

కొత్తూరు: ఒడిషా రాష్ట్రం గుణుపూర్ నుంచి చెన్నైకి అక్రమంగా ఏడు కిలోల గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు టెక్కలి డీఎస్పీ దాసరి లక్ష్మణరావు తెలిపారు. కొత్తూరు సర్కిల్ కార్యాలయంలో మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం మదురైకు చెందిన మహలింగం సూర్య గుణుపూర్ నుంచి ఏడు కిలోల గంజాయిని బ్యాగ్‌లో పెట్టుకొని ఒడిషా రాష్ట్రం హడ్డుబంగి నుంచి కొత్తూరు మండలం మాతల వైపు కాలినడకన బయలుదేరాడు. మాతల వద్ద ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డాడు. గంజాయిని స్వాధీనం చేసుకొని సూర్యపై కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. సమావేశంలో సీఐ చింతాడ ప్రసాదరావు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ ఉప ఎన్నికలను రద్దు చేయాలి



మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: పులివెందుల, ఒంటిమిట్ట మండలాల్లో మంగళవారం జరిగిన జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరించిందని మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు తమ్మినేని సీతారాం మండిపడ్డారు. ఎన్నికలు జరిగిన గ్రామాల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోలేకపోయార ని అన్నారు. ఆయన మంగళవారం ఆమదాలవలసలో విలేకరులతో మాట్లాడారు. పక్క నియోజకవర్గాల నుంచి టీడీపీ గూండాలను దించి ఓటు వేయకుండా చేశారని విమర్శించారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించాల్సిన పోలీస్ ఉన్నతాధికారులు ప్రేక్షక పాత్ర వహించటం దారుణమని అన్నారు. కడప వైఎస్సార్ సీపీలో కీలకంగా ఉన్న వై ఎస్ అవినాష్ రెడ్డిని అరెస్టు చేయడం దారుణమన్నారు. తన సుదీర్ఘ రాజకీయ అనుభవంలో ఇలాంటి ఎన్నికలను తాను ఎన్నడూ చూడలేదని అన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఉప ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా ఎన్నికలు జరిగిన తీరును పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే, ఉప ఎన్నికలను రద్దు చేసి, మరోసారి ప్రశాంతంగా ఎన్నికలను నిర్వహించాలని తమ్మినేని డిమాండ్ చేశారు.

జెడ్పీటీసీ ఉప ఎన్నికకు ఇన్ని కుతంత్రాలా..?



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: కడప జిల్లాలో జెడ్పీటీసీ ఉప ఎన్నికల సందర్భంగా కూటమి నాయకుల వైఖరిని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తీవ్రంగా ఖండించారు. దౌర్జన్యాలు, అక్రమాలు, ఓటర్లను భయపెట్టడాలు, వైఎస్సార్‌సీపీ నాయకుల అక్రమ అరెస్టులపై ఆయన ధ్వజమెత్తారు. 'ఎన్నికలు ఎందుకు నిర్వహించడం.. జెడ్పీటీసీలను నామినేట్ చేసుకోండి.. ఎన్నికల పేరిట ఇంతకు దిగజారాలా' అని ప్రశ్నించారు. ఆయన మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పులివెందులలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని తీవ్రంగా విమర్శించారు. జెడ్పీటీసీ అభ్యర్థిని కూడా ఓటు వేయనీయకుండా అడ్డుకోవడం దిగజారిన పరిస్థితికి అద్దం పడుతోందన్నారు. చంద్రబాబు పాలన హిట్లర్ నియంత పాలనను మరిపిస్తోందన్నారు. ఎంపీ అవినాష్ రెడ్డిని అరెస్టు చేయడం, పోలీసు బలగాలు టీడీపీ నాయకులకు కొమ్ము కాయడాన్ని తీవ్రంగా తప్పు పట్టారు. రైతులు నానా అవస్థలు పడుతుంటే కూటమి నాయకులు సంబరాలు చేసుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఎరువు అందక, నీరు లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతుంటే కూటమి నాయకులు సంబరాల ర్యాలీలు చేయడం వారి పైత్యానికి నిదర్శనమన్నారు.


'ఉద్దానంలో విధ్వంసం సహించబోము'



మాట్లాడుతున్న నారాయణ

మందస: కార్గో ఎయిర్ పోర్టు పేరుతో ఉద్దానంలో విధ్వంసం చేస్తే సహించేది లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ఎం.గంగువాడ నుంచి రాంపురం వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కె.నారాయణ మాట్లాడుతూ కార్గో ఎయిర్ పోర్టు పేరుతో బలవంతంగా భూములు తీసుకోవడం వల్ల ఇక్కడి ప్రజలు నిరాశ్రయులవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో అతిపెద్ద ఎయిర్‌పోర్టు అయిన ఢిల్లీ కార్గో ఎయిర్ పోర్టుకి కేవలం 150 ఎకరాలు మాత్రమే ఉందని ఇక్కడ కార్గో ఎయిర్ పోర్టుకి 1400 ఎకరాలు ఎవరి ప్రయోజనం కోసం కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. దేశంలో ప్రముఖ ఎయిర్‌పోర్టులకు అనుబంధంగానే కార్గో ఎయిర్‌పోర్టులు ఉన్నాయని, ఇక్కడెందుకు ప్రత్యేకంగా కార్గోను నిర్మిస్తున్నారని నిలదీశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ కేవలం కార్పొరేట్ కంపెనీల కోసం ప్రజల భూములు లూటీ చేస్తారా అని ప్రశ్నించారు.

• ఏనుగులను పరిరక్షిద్దాం



ప్రపంచ ఏనుగుల దినోత్సవం పురస్కరించుకుని పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ పూరీ సాగర తీరంలో సైకత శిల్పం తీర్చి దిద్దాడు. ఈ సందర్భంగా గజరాజుల సంరక్షణ కోసం ఏనుగుల ఆవాస అటవీ ప్రాంతాలను పరిరక్షించడం బాధ్యతగా గుర్తించాలని పిలుపునిచ్చారు. – భువనేశ్వర్/పూరీ

• క్లర్క్ ఉద్యోగుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న క్లర్కులు

మల్కన్‌గిరి: జిల్లాలోని ప్రభుత్వ క్లర్క్ ఉద్యోగులు కలెక్టర్ కార్యాలయం ఎదుట మరోసారి మంగళవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా క్లర్క్ సంఘాలు అనేక సార్లు సమావేశమై సమస్యలు గురించి అధికారులకు తెలియజేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హామీలు అమలు చేయకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి దిలీప్ నాయక్ టుకుణా పడియారి, రాష్ట్ర కార్య నిర్వాహక కమిటీ సభ్యుడు శ్యామ్ సుందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమానుషం!

- వ్యాపారం తక్కువైందని షాపులో పనిచేస్తున్న యువకుడిపై దాడికి పాల్పడిన యజమాని
- చికిత్స పొందుతూ యువకుడు మృతి
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన



రాజేష్ (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : తన వద్ద పనిచేసిన యువకుడిని మద్యం మత్తులో మరో వ్యక్తితో కలసి దాడికి పాల్పడ్డాడో యజమాని. లెక్కల్లో తేడా వచ్చిందని కొట్టి ఇంటి ముందు పడేసి నిర్లక్ష్యంగా ఇద్దరూ వెళ్లిపోయారు. ఈ నెల 3వ తేదీ రాత్రి జిల్లా కేంద్రంలోని పొట్టిశ్రీరాములు మార్కెట్లో బాధితుడు ఉల్లాకుల రాజేష్ (32)పై జరిగిన ఈ దాడి ఘటన అప్పట్లో బయటకు పొక్కకుపోయినా కేజీహెచ్‌లో యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందడంతో వెలుగులోకి వచ్చింది. ఒకటో పట్టణ పోలీసులు హత్యకేసుగా నిర్ధారించి దాడికి పాల్పడిన యజమాని చీకటి వంశీ, సహకరించిన పుక్కళ్ల రామకృష్ణలను అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ హరికృష్ణ, బాధిత కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు..

అరసవల్లికి చెందిన ఉల్లాకుల రాజేష్ కొంతకాలంగా పొట్టి శ్రీరాములు మార్కెట్లో చీకటి వంశీ నిర్వహిస్తున్న పండ్ల దుకాణంలో రోజువారీ కూలీకి పని చేస్తున్నాడు. ఎప్పట్లాగే ఈ నెల 3న రాజేష్ దుకాణం తెరిచి వ్యాపారం చేశాడు. అదేరోజు రాత్రి మద్యం పూటుగా సేవించి వచ్చిన యజమాని వంశీ ఎంత వ్యాపారం జరిగిందని రాజేష్‌ను ప్రశ్నించడంతో రూ.24 వేలుగా లెక్క చూపించాడు. ఆదివారం కావడంతో పెద్దగా వ్యాపారం జరగలేదని చెప్పిడబ్బులు అప్పగించి ఇంటికి వెళ్లిపోయేందుకు రాజేష్ ప్రయత్నించాడు. దీంతో కోపోద్రిక్తుడైన వంశీ ఒక్కసారిగా రాజేష్‌పై దాడికి పాల్పడ్డాడు. అతికష్టమ్మీద అక్కడి నుంచి రాజేష్ పారిపోయాడు. అనంతరం వంశీ నగరానికి చెందిన మిత్రుడు పుక్కళ్ల రామకృష్ణను రప్పించాడు. తర్వాత రాజేష్‌కు పలుమార్లు ఫోన్‌చేసి కౌంటర్‌లో మాయం చేసిన డబ్బులు తిరిగివ్వకపోతే చంపేస్తామంటూ దుర్భాషలాడుతూ బెదిరించాడు. అనంతరం అరసవల్లి జంక్షన్‌లో రాజేష్ ఉన్నాడని తెలుసుకుని రామకృష్ణ ద్వారా మార్కెట్టుకు రప్పించాడు. ముఖం, తలపై పిడిగుద్దుల వర్షం కురిపించి రోడ్డుపైకి నెట్టేశారు. తీవ్ర గాయాలపాలైన రాజేష్‌ను అర్ధరాత్రి 12:30 గంటలకు అతని ఇంటిముందు పడేసి వెళ్లిపోయారు. తెల్లవారుఝామున భార్య ధరని తన భర్త అపస్మారక స్థితిలో ఉండటాన్ని చూసి రిమ్స్‌కు తరలించింది. పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌లో చేర్పించారు. రాజేష్ అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కాగా, దాడి జరిగి దాదాపు పదిరోజులు కావస్తున్నా విషయాన్ని బయటకు పొక్కనీయకపోవడంపై పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రాణదాతలకు సలాం!

- ఈ నెల 7న ఒడిశాలోని రాణిపేట గ్రామానికి చెందిన లెంక రవణమ్మ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైంది. కుటుంబసభ్యులు రాగోలు జెమ్స్‌కు తీసుకురాగా బ్రెయిన్‌డెడ్‌గా చెప్పారు. వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు ఆమె అవయవదానానికి అంగీకరించారు. దీంతో గ్రీన్‌చానెల్ ద్వారా అవయవాలను ఇతర ప్రాంతాలకు తరలించారు.
- జూలై 29న కోటబొమ్మాళి మండలం నిమ్మాడ జంక్షన్‌కు చెందిన పినిమింటి శ్రీరామ్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబసభ్యులు వెంటనే రాగోలు జెమ్స్‌కు తీసుకొచ్చారు. ఆయన బ్రెయిన్‌డెడ్ కావడంతో వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకొచ్చారు. గ్రీన్‌చానెల్ ద్వారా అవయవాలను తరలించారు.

పునర్జన్మ



అవయవదానం మహోన్నతమైనది. ఒకరు దానం చేస్తే 8 మందికి పునర్జన్మ దక్కుతుంది. జిల్లాలో అవయవదానాలు పెరుగుతుండడం శుభపరిణామం. అయితే చాలామందిలో అపోహలు ఉన్నాయి. అయితే ఆపదకాలంలో ఉన్నవారికి తమవారి అవయవాలు దానం చేసి వారి బతుకుల్లో వెలుగులు నింపవచ్చు. – ఫారుక్ హుస్సేన్, వైద్యాధికారి, హిరమండలం పీహెచ్‌సీ

- మహోన్నతంగా నిలుస్తున్న అవయవదానం
- ఒకరి త్యాగం.. పలువురికి పునర్జన్మ
- అవయవదానంతోనే అది సాధ్యం
- జిల్లాలో పెరుగుతున్న దాతలు
- ముందుకొస్తున్న కుటుంబాలు
- నేడు అవయవదాన దినోత్సవం

హిరమండలం: జిల్లాలో అవయవదానంపై చైతన్యం పెరుగుతోంది. కుటుంబసభ్యుల అంగీకారంతో చేసిన అవయవదానం ఎంతోమందికి పునర్జన్మనిస్తోంది. ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. కొంతమంది ప్రమాదాలబారిన పడినప్పుడు బ్రెయిన్ డెడ్‌కు గురవుతున్నారు. అటువంటి వారి అవయవాలను కుటుంబసభ్యుల సమ్మతితో దానం చేస్తే ఎంతోమంది ప్రాణాలను నిలపవచ్చు. ఒక మనిషి అవయవదానంతో 8 మంది ప్రాణాలను నిలపవచ్చు. కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, గుండె, కవటాలు, పేగులు, క్లోమం, కార్నియా వంటివి సేకరించి మరొకరికి అమర్చవచ్చు. జీవించి ఉన్న వ్యక్తుల నుంచి మూత్రపిండాలు, ఎముకలోని మూలుగు, కాలేయంలోని కొంతభాగం దానం చేయవచ్చు.

బ్రెయిన్ డెడ్ అయితే..

రోడ్డు ప్రమాదంలో ఎంతో మంది తీవ్రగాయాలపాలవుతుంటారు. ఆ సమయంలో కొన్నిసార్లు మెదడు దెబ్బతిని బ్రెయిన్ డెడ్ అవుతుంటుంది. తిరిగి కోలుకోలేని స్థితికి వెళ్లిపోతుంటారు. ఇలాంటి వారిలో గుండె, కాలేయం, కిడ్నీల వంటి అవయవాలు పనిచేస్తుంటాయి. వీటన్నింటినీ నడిపించే కీలకమైన అవయవం మెదడు మాత్రం పనిచేయదు. దానినే బ్రెయిన్ డెడ్ అంటారు. పక్షవాతం వంటి మెదడు సమస్య తలెత్తినప్పుడు కూడా బ్రెయిన్‌డెడ్ కావొచ్చు.



మానవుని అవయవాలు

నిర్ధారణ కీలకం..

ఎవరైనా బ్రెయిన్ డెడ్ అయ్యారని నిర్ధారించేందుకు కట్టుదిట్టమైన విధానాలు ఉన్నాయి. ఆస్పత్రి వైద్యులు మాత్రమే దీనిని నిర్ధారించరు. ఇతర ఆస్పత్రుల వైద్యులు, జీవన్‌దాన్ సంస్థ తరఫున వచ్చే నిపుణులు వ్యక్తిని క్షుణ్ణంగా పరిశీలిస్తారు. అక్కడకు 6 గంటల తరువాత మరో బృందం పరిశీలించి బ్రెయిన్ డెడ్ అని నిర్ధారిస్తారు. శ్వాసతీసుకునే పరిస్థితి ఉండకపోవడం, ఒకవేళ కృత్రిమ శ్వాస తీసిన 5 నిమిషాల్లో చనిపోయే స్థితిలో ఉన్న వ్యక్తి నుంచి మాత్రమే అవయవాలను సేకరిస్తారు. కనుపాపల్లో వెలుతురు పడినా స్పందించకపోయే వారిని, కాళ్లు, చేతులు, తల ఎంతమాత్రం కదపలేకపోయేవారిని, మెదడుకు ఏమాత్రం రక్తప్రసరణ జరగడం లేదని నిర్ధారించుకున్న తరువాత బ్రెయిన్ డెడ్ అని తేల్చుతారు.

కఠిన నిబంధనలు..

బాధితుల నుంచి అవయవాలను సేకరించే వైద్యులు తప్పకుండా జీవన్‌దాన్‌లో నమోదై ఉండాలి. తమ పేర్లు తప్పకుండా రిజిస్ట్రేషన్లు చేయాలి. మన జిల్లాకు సంబంధించి జెమ్స్ ఆస్పత్రి వైద్యులు నమోదైనట్టు తెలుస్తోంది. అయితే చనిపోయిన వారికి, అవయవాలు అవసరమైన వారికి ఈ వైద్యులు బంధువులు కాకూడదు. బ్రెయిన్ డెడ్ అయిన వారి కుటుంబసభ్యుల అంగీకారం కీలకం. ఎవరికైనా అవయవాలు అవసరమైతే జీవన్‌దాన్‌లో నమోదుచేసుకోవాలి. అవయవదాత ఉన్నారని సమాచారం అందితే ప్రాధాన్యతాక్రమంలో, ముందు వరుసన బట్టి అవయవాలను తెచ్చి అమర్చుతారు. గుండెను బయటకు తీశాక 4 గంటల్లో అమర్చితే ఫలితాలు 90 శాతం మెరుగ్గా ఉంటాయి. ఆరు గంటలు లోపు అయితే 50 శాతం ఫలితమే ఉంటుంది. 6 గంటలు దాటితే అమర్చినా ఫలితం ఉండదు. ఊపిరితిత్తులు 8 గంటల్లోపు, కాలేయం 18 గంటల్లోపు, కిడ్నీ 24 గంటల్లోపు అమర్చాలి.